

పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి


నమస్తే తెలంగాణ

వికారాబాద్

I | హైదరాబాద్, ఆదివారం 23 జూన్ 2024 | VIKARABAD


## విపత్తు సమయంలో ఆదుకునేలా..

సిటీబ్యూరో, జూన్ 22 (నమస్తే తెలంగాణ) : డైరెక్టరేట్ ఆఫ్ ఈవీడీఎం ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు, ఔత్సాహికులకు విపత్తు నిర్వహణ చర్యలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. 2020లో ముంచెత్తిన వరదల తరహాలో ఈ ఏడాది భారీ ప్రమాదాలకు ఆస్కారం ఉన్నదనే అంచనాల నేపథ్యంలో సిబ్బందికి వరద సహాయం, కూలిన చెట్ల తొలగింపు, భవనాల్లో జరిగే ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలపై సమగ్రమైన అవగాహన కల్పించేలా శిక్షణ కల్పించారు. ముఖ్యంగా మూసీ, నాలా పరీవాహక ప్రాంతాల్లోని లోతట్టు కాలనీల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలతో పాటు స్థానికులను అప్రమత్తం చేసేలా అవగాహన కల్పించారు. గ్రేటర్‌లోని పలు స్వచ్ఛంద సంస్థలతో కలిపి నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో అర్బన్ ఫ్లడ్, వరదల నియంత్రణ, ప్రమాద తీవ్రతను తగ్గించడంపై శిక్షణ ఇచ్చారు. 60 మంది స్వచ్ఛంద కార్యకర్తలు హాజరు కాగా, మూడు గ్రూపులుగా చేసి తరగతులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఫతుల్లాగూడలోని డీఆర్‌ఎఫ్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉదయం నుంచి సాయంత్రం జరిగే శిక్షణ తరగతులకు హాజరు కావాలనుకునే వారు 7981665687 నంబర్‌లో సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

## ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

**ఎస్పీ కె.నారాయణ రెడ్డి**

వికారాబాద్,జూన్ 22 : పోలీసు అధికారులు అందరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వికారాబాద్ ఎస్పీ కె.నారాయణరెడ్డి తెలిపారు. శనివారం వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో వీక్లీ పరేడ్‌ను పరిశీలించి, పోలీస్ సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. పరేడ్ కమాండర్ ఆర్ఐ అంజాద్ పాషా జిల్లా ఎస్పీకి గౌరవ వందనం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్క పోలీస్ అధికారి తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, నిత్యం వ్యాయామం కోసం సమయం కేటాయించాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం కావున మనం ఆరోగ్యంగా ఉన్నప్పుడే సక్రమంగా విధులు నిర్వహించవచ్చన్నారు. మన కుటుంబాన్ని కూడా బాగా చూసుకోవచ్చని, పోలీస్ అధికారులు చురుకుగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా పని చేయాలంటే ఫిట్‌గా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, డేవిడ్ విజయ్ కుమార్, ఆర్ఎస్సైలు, వికారాబాద్ పోలీస్ స్టేషన్ పోలీస్ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

## నీలివిప్లవంపై నీలినీడలు



- జూన్ దాటుతున్నా ఉచిత చేప పిల్లల పంపిణీ ఊసెత్తని సర్కారు
- ఖరారు కాని టెండర్లు
- అయోమయంలో మత్స్యకారులు
- పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని విజ్ఞప్తి

బొంరాస్‌పేట, జూన్ 22 : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తిలోదకాలు ఇస్తున్నది. కులవృత్తులపై ఆధారపడి జీవించే వారి సంక్షేమానికి గతంలో కేసీఆర్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది. గొల్లకురుమలకు ఉచితంగా గొర్రె పిల్లలను పంపిణీ చేయగా ఆ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. దళితుల ఆర్థిక అభ్యున్నతి కోసం అమ లు చేసిన దళితబంధు, బీసీల బాగు కోసం తీసుకొచ్చిన బీసీ బంధు వంటి సంక్షేమ పథకాల ఊసే కనిపించడంలేదు. అదే దారిలో ఉచిత చేప పిల్లల పంపిణీ పథకంపైనా నీలినీడలు కమ్ముకున్నాయి. జూన్ నెల దాటుతున్నా ఉచిత చేప పిల్లల పంపిణీపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేదు. ప్రతిఏటా ఈ సమయంలోపే టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి అయ్యేది. కానీ, ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో మత్స్యకారుల్లో అయోమయం నెలకొన్నది. ఈ పథకం కొనసాగుతుందా..? లేదా అని ఆందోళన చెందుతున్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెరువులు, ప్రాజెక్టుల్లో ఉచితంగా చేప పిల్లలను వదలడంతో అనేకమంది మత్స్యకారులు జీవనోపాధి పొందారు.

### ప్రభుత్వానికి ముందు చూపులేదు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసి ఆదుకున్నది. వర్షాకాలం ప్రారంభమైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఉచిత చేప పిల్లల పంపిణీ యథావిధిగా కొనసాగించాలి.

**–తిరుపతయ్య, మత్స్య సహకార సంఘం మాజీ డైరెక్టర్, తుంకిమెట్ల**

### ఆర్థికంగా లాభపడ్డాం..

మాజీ సీఎం కేసీఆర్ మత్స్యకారుల సంక్షేమానికి ఎంతో కృషిచేశారు. ఏటా చెరువుల్లో చేపపిల్లలను ఉచితంగా వదిలి వాటి ద్వారా మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు చేప పిల్లల పంపిణీపై చర్యలు తీసుకోలేదు. పథకం కొనసాగుతుందా..? లేదా అనే అనుమానం మొదలైంది. ప్రభుత్వం మత్స్యకారులకు అండగా నిలవాలి.

**–లక్ష్మీనారాయణ, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దుప్‌చెర్ల**

### జిల్లాలో 144 మత్స్య సహకార సంఘాలు..

వికారాబాద్ జిల్లాలో 144 మత్స్య సహకార సంఘాలున్నాయి. వాటిలో 5300 మంది సభ్యులున్నారు. 2016–17లో 18.75 లక్షల చేప పిల్లలను చెరువుల్లో వదలగా.. 2017–18లో 53.41లక్షలు, 2018–19లో 25.99లక్షలు, 2019–20లో 197 చెరువుల్లో 41.54 లక్షలు, 2020–21లో 555 చెరువుల్లో 98.64 లక్షలు, 2021–22లో 691 చెరువుల్లో 1.17 కోట్ల చేప పిల్లలు, 2022–23లో 692 చెరువుల్లో 1.18 లక్షల చేప పిల్లలను మత్స్యశాఖ అధికారులు ఉచితంగా వదిలారు.

# రియల్ డీలా



## ఆరునెలలుగా నిలిచిన భూ వినియోగ మార్పిడి అనుమతులు

### కొత్త వెంచర్లు లేక రియల్టర్ల నిరుత్సాహం.. పొంచి ఉన్న 'అమరావతి' ముప్పు

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 22 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరమంటే రియల్ సందడి. గల్లీ మొదలు కార్పొరేట్ కార్యాలయాల వరకు రియల్టర్లు.. మార్కెటింగ్ ఏజెంట్లతో పాటు సాధారణ యువకుడు సైతం రియల్ ఎస్టేట్ రంగాన్ని ఒక ఉపాధి మార్గంగా మలుచుకున్నాడు. కానీ గత కొన్ని నెలలుగా మహా నగరంలో 'రియల్' కళ తప్పింది. ముఖ్యంగా నిత్యం హడావిడిగా ఉండే శివారు ప్రాంతాల్లో ఆ సందడే కనిపించడం లేదు. ఇందుకు అనేక సామాజిక కారణాలు ఉన్నప్పటికీ... ప్రభుత్వపరంగా ఆశించిన సహకారం లేకపోవడం రియల్టర్లను ఆవేదనకు గురి చేస్తున్నది. ఇందులో భాగంగా రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి వినిపిస్తున్న ప్రధాన కారణం... కొత్త వెంచర్లకు అవకాశం లేకపోవడం. సాధారణంగా నివాసయోగ్య (రెసిడెన్షియల్) జోన్‌లో ఉన్న భూముల్లో వెంచర్లకు అనుమతులు వచ్చే అవకాశం ఉన్నా.. నగర చుట్టూ అనేక ప్రాంతాల్లో ఇతర జోన్లలోని భూములను నివాసయోగ్య భూముల జాబితాలోకి మార్చేందుకు కావాల్సిన 'భూ వినియోగ మార్పిడి (ఛేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్)' అనుమతులు నిలిచిపోవడంతో రియల్ ఎస్టేట్ రంగాన్ని నీరుగార్చుతున్నదని పలువురు రియల్ వ్యాపారులు వాపోతున్నారు.

### కీలకంగా రియల్ ఎస్టేట్..

విశ్వ నగరంగా మారుతున్న హైదరాబాద్ తెలంగాణకు మాత్రమే కాదు.. దేశానికి సైతం ఒక ఆర్థిక ఇంజిన్. అంతర్జాతీయ మౌలిక వసతులు ఉన్న ఈ మహా నగరంలో విద్య, వ్యాపార, పారిశ్రామిక, ఐటీ వంటి రంగాలే కాదు.. రియల్ ఎస్టేట్ రంగం అనేది చాలా కీలకంగా మారింది. ఏటా లక్షల కోట్ల లావాదేవీలు జరిగే ఈ రంగంలో అదేరీతిలో ఉపాధి అవకాశాలు కూడా భారీగానే ఉన్నాయి. అందుకే తెలంగాణ ఏర్పడిన తర్వాత వచ్చిన మౌలిక వసతులతో దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, కోల్‌కత్తా, చెన్నై వంటి మహా నగరాలను సైతం వెనక్కి నెట్టింది. ఆఫీస్ స్పేస్‌లోనైతే హైదరాబాద్ దేశంలోనే రారాజుగా నిలిచింది. అలాంటి మహా నగరంలో ఇప్పుడు రియల్ ఎస్టేట్ రంగం కళ తప్పింది. లక్షల చదరపు అడుగుల్లో అపార్టుమెంట్లు కొనుగోలుకు సిద్ధంగా ఉన్నా.. గతంలోని దూకుడు కనిపించక బిల్డర్లు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో శివారు ప్రాంతాల్లోనైనా కొత్త కొత్త వెంచర్ల ద్వారా కొంత ఊపు వచ్చే అవకాశమున్నా.. పలు కారణాలు కొత్త ప్రాజెక్టులకు మోకాలడ్డుతున్నాయి. ఇప్పటికే నగరానికి వంద కిలోమీటర్ల పరిధిలోని భూములు అత్యధికం దాదాపు వెంచర్లుగా మారాయి. ఇందులో సింహభాగం గతంలో జరిగినవి కాగా.. నివాసయోగ్య జోన్‌లో ఉన్న వాటిని హెచ్ఎండీఏ అనుమతులతో వెంచర్లుగా మారుస్తున్నారు. కానీ నివాసేతర జోన్‌లోని భూముల్లో వెంచర్లు చేయడం ఇప్పుడు వ్యాపారులకు ఒక సవాల్‌గా మారింది.


### ఆరు నెలలుగా..

సాధారణంగా గతంలో హెచ్ఎండీఏ రూపొందించిన మాస్టర్‌ప్లాన్–2031 ప్రకారం భూమిని పన్నెండు రకాల జోన్లుగా విభజించారు. నివాసం, వ్యవసాయం, వినోదం, పారిశ్రామికం, అటవీ... ఇలా పన్నెండు జోన్లలోని సబ్ జోన్లు కలుపుకొని సుమారు 21–24 రకాలుగా విభజన జరిగింది. ఇందులో నివాసయోగ్య జాబితాలో ఉన్న భూముల్లో మాత్రమే వెంచర్లకు అవకాశం ఉంటుంది. మిగిలిన జోన్లలోని భూములను నివాసయోగ్యంలోకి మార్చుకొని (భూ వినియోగ మార్పిడి) ఆ తర్వాత వెంచర్లు చేపట్టాల్సి ఉంటుంది. ఈ క్రమంలో బయో కన్జర్వేషన్ మినహా దాదాపుగా మిగిలిన జోన్లలోని భూములను నివాసయోగ్యంలోకి మార్చుకునే వీలుంది. ఇందుకోసం సదరు యజమానులు భూ వినియోగ మార్పిడి కింద దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు నిబంధనల ప్రకారం వాటిని పరిశీలించి.. నిర్దేశిత రుసుముతో ప్రభుత్వానికి ప్రతిపాదిస్తే అనంతరం ప్రభుత్వం పరిశీలించి ఉత్తర్వులు జారీ చేస్తుంది. అయితే నగరం చుట్టూ నివాసయోగ్య భూములు కాకుండా ఇతర జోన్లలో వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. వాటిని వెంచర్లుగా చేసేందుకు అవకాశం ఉన్నా... గత ఆరునెలలుగా భూ వినియోగ మార్పిడి అనుమతులు లేకపోవడంతో కొత్త ప్రాజెక్టులకు అంకురార్పణ జరగడం లేదు.

### పెండింగ్‌లో దరఖాస్తులు..

గతంలోని దరఖాస్తులు చాలా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో అటు కొత్త వెంచర్లు రాకపోవడం ఒకవంతైతే... ప్రభుత్వ ఖజానాకు కూడా వందలాది కోట్ల ఆదాయం నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికైనా భూ వినియోగ మార్పిడి ప్రక్రియకు అనుమతులు ఇవ్వాలని చాలామంది రియల్టర్లు కోరుతున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో అమరావతి రాజధాని అభివృద్ధి అనేది కూడా హైదరాబాద్ రియల్ రంగంపై ప్రభావం చూపే అవకాశమున్నదని పలువురు రియల్టర్లు స్పష్టం చేస్తున్నారు. అనుమతులు వచ్చిన తర్వాత ప్రాజెక్టు పట్టాలెక్కేందుకు కనీసం ఆరునెలల సమయం పడుతుందని, ఈ క్రమంలో ఇక్కడ కొత్త వెంచర్లకు అవకాశం లేనందున రియల్టర్లు అటు వైపు చూసే అవకాశమూ లేకపోలేదని ఒక రియల్టర్ అభిప్రాయపడ్డారు. వ్యాపారులకు టర్నోవర్ అనేది ప్రధానమని, అందుకే నెలల తరబడి ఖాళీగా ఉండటం కంటే అవకాశం ఉన్నచోటకు వెళ్లడం శ్రేయస్కరమనే కోణంలో ఆలోచించక తప్పదని వ్యాఖ్యానించారు.

# అంతరాయం.. నిత్యకృత్యం



- విద్యుత్ నెట్‌వర్క్ నిర్వహణలో నిర్లక్ష్యం
- కరెంటు సరఫరాలో తరచూ అంతరాయాలు
- క్షేత్రస్థాయిలో లైన్ల తనిఖీకి సీఎండీ ఆదేశాలు


సిటీబ్యూరో, జూన్ 22 (నమస్తే తెలంగాణ): అధికారికంగా ఎలాంటి కరెంటు కోతలు లేకపోయినా.. సబ్ స్టేషన్లలో నిరంతరం నాణ్యమైన విద్యుత్ ఉన్నా... క్షేత్ర స్థాయిలో సరఫరాలో అంతరాయాలు నిత్యకృత్యంగా మారాయి. సబ్ స్టేషన్ల నుంచి డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల (డీటీఆర్)ల వరకు వెళ్లే 11 కేవీ విద్యుత్ లైన్లు, అదే విధంగా ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఇండ్లకు వెళ్తున్న ఎల్‌టీ లైన్లలో ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. స్థానికంగా అకస్మాత్తుగా సరఫరా నిలిచిపోతే దాని పునరుద్ధరించేందుకు సిబ్బంది గంటల తరబడి సమయం తీసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. సకాలంలో క్షేత్ర స్థాయిలోని 11 కేవీ, ఎల్‌టీ లైన్లను పరిశీలించి..మరమ్మతులు చేయకపోవడంతోనే తరచూ కరెంటు సరఫరా నిలిచిపోతున్నదని నిపుణులు పేర్కొంటున్నారు. విద్యుత్ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి.. ఎప్పటికప్పుడు లైన్లను పరిశీలించకుండా సబ్‌స్టేషన్లు, సెక్షన్ కార్యాలయాలు, డీఈ, కార్పొరేట్ కార్యాలయాల్లోనే ఎక్కువ సమయంలో గడుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

### 11 కేవీ ఫీడర్ల పరిధిలో..

సెక్షన్ల వారీగా ఆపరేషన్స్ విభాగం అధికారులు విద్యుత్ లైన్ల నిర్వహణ విషయంలో ప్రణాళికాబద్ధంగా తనిఖీలు చేసి లైన్లు దెబ్బతినే అవకాశం ఉన్న చోట వాటిని మార్చాల్సి ఉన్నా, అటు వైపు ఎవరూ కన్నెత్తి చూడటం లేదు. కేవలం విద్యుత్ లైన్లు తెగినప్పుడు, చెట్లు, వాటి కొమ్మలు మీద పడినప్పుడు, ఇతర కారణాలతో లైన్లు దెబ్బతిని సరఫరా నిలిచిపోతేనే సిబ్బంది స్పందించి మరమ్మతులు చేస్తున్నారు. గత వారం రోజులుగా గ్రేటర్ పరిధిలో 9 సర్కిళ్లలో ఎక్కడ చూసినా.. 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలోఅంతరాయం ఏర్పడిందని, దాన్ని సరి చేసేందుకు కొంత సమయం పడుతున్నదని ట్విట్టర్ వేదికగా సర్కిళ్ల అధికారులు, డీఈ స్థాయి అధికారులు సమాచారాన్ని పోస్టు చేశారు. ఇలా అధికారులు చేసే పోస్టులే నిత్యం పదికి మించి ఉంటున్నాయని, దీన్ని బట్టే నిర్వహణ, మరమ్మతు తీరు ఎంత అధ్వానంగా ఉందో అర్థమవుతున్నదని విద్యుత్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక విద్యుత్ వినియోగదారులు చేసే ఫిర్యాదులు సెక్షన్ల వారీగా చూసినా పదుల సంఖ్యలో ఉంటే, ఒక సర్కిల్ పరిధిలో తీసుకుంటే అంతకు రెట్టింపు స్థాయిలో ఉన్నాయి.

### సమగ్ర సర్వేకు సీఎండీ ఆదేశం...

క్షేత్ర స్థాయిలో విద్యుత్ లైన్లలో తలెత్తున్న సమస్యలను గుర్తించేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారు. వచ్చే సోమవారం నుంచి ప్రతి విద్యుత్ స్తంభం నుంచి వెళ్లే విద్యుత్ లైన్ల పరిస్థితి ఎలా ఉంది..? ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్ బాక్సులు, ఇతర కేబుళ్లు ఎలా ఉన్నాయన్న విషయాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. ఇదంతా మొక్కుబడిగా కాకుండా 9 సర్కిళ్ల పరిధిలో ఉండే ప్రతి స్తంభం వద్దకు వెళ్లి పూర్తి వివరాలను ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో సూపరింటెండెంట్ ఇంజినీర్ నుంచి మొదలుకొని ఆర్టిజన్ వరకు తిరిగి విద్యుత్ వినియోగదారులను కలుసుకొని సమస్యలను తెలుసుకునే ఈ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించనున్నారు. కొత్తగా చేపడుతున్న క్షేత్ర స్థాయి పరిశీలనతో 11 కేవీ లైన్లలో ప్రతి అంశాన్ని పరిశీలించి.. వివరాలను నమోదు చేయనున్నారు. ఆదేవిధంగా ఎల్‌టీ, 33 కేవీ లైన్లను పరిశీలించి సమస్యలు ఎక్కడ వస్తున్నాయో గుర్తించనున్నారు. మొత్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు పటిష్టమైన కార్యాచరణతో ముందుకెళ్లాలని ఎస్ఈలకు సీఎండీ ఆదేశించారు.



కంపెనీ ప్రతినిధులతో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి(ఫైల్)

# కల సాకారం..

## ఫాక్స్‌కాన్‌లో ఆగస్టు నుంచి ప్రారంభం కానున్న మొదటిదశ

- 25వేల మందికి దక్కనున్న ఉద్యోగాలు..
- దశల వారీగా లక్షమందికి లభించనున్న ఉపాధి
- పట్టుబట్టి ఫాక్స్‌కాన్‌ను పట్టుకొచ్చిన మంచిరెడ్డి..

ఇబ్రహీంపట్నం, జూన్ 22 : రంగారెడ్డిజిల్లా కొంగరకలాన్‌లో ఏర్పాటు కానున్న ఫాక్స్‌కాన్‌తో ఈ ప్రాంత ఉద్యోగుల కల సాకారం కానుంది. రంగారెడ్డిజిల్లా తూర్పు ప్రాంత నిరుద్యోగులకు ఫాక్స్‌కాన్‌తో ఎంతోమంది స్థానికులకు ఉద్యోగావకాశాలు దక్కనున్నాయి. సుమారు లక్షమందికి ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పట్టుబట్టి ఫాక్స్‌కాన్‌ను ఈ ప్రాంతానికి తీసుకురావటంలో కీలకపాత్ర పోషించారు. 4600కోట్లతో జపాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ సంస్థను కొంగరకలాన్ సమీపంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద సుమారు రెండువందల ఎకరాల్లో ఏర్పాటు చేశారు. ఈ పరిశ్రమ ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయటానికి అప్పటి ఐటీశాఖమంత్రి కేటీరామారావు ప్రత్యేక చొరవతో తెలంగాణలో ఏర్పాటు చేయించారు. ముందుగా కంపెనీ ప్రతినిధులు గుజరాత్, మహారాష్ట్రలో ఏర్పాటు చేయాలనుకున్నప్పటికీ ఫాక్స్‌కాన్ ప్రతినిధులను ఒప్పించి వారికి అన్ని రకాల భరోసా కల్పించి ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయించారు. గత సంవత్సరం మార్చి 2న ఆ సంస్థ ఛైర్మన్ యంగ్‌లీయూతో తెలంగాణ ప్రభుత్వానికి ఒప్పందం కుదిరింది. అందులో భాగంగానే మే 15న కొంగరకలాన్‌లోని కలెక్టర్ కార్యాలయ సమీపంలో ఫాక్స్‌కాన్ సంస్థకు ఆ సంస్థ ఛైర్మన్ యంగ్‌లీయూతో కలిసి అప్పటి మంత్రి కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిలు భూమిపూజ చేశారు. అప్పటినుంచి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. అప్పటినుంచి మొదటిదశలో రూ.2640కోట్లతో ఫాక్స్‌కాన్ సంస్థను ప్రారంభించారు. ఇందులో మొదటిదశ పనులు పూర్తి కావస్తున్నందున, వచ్చే ఆగస్టు నుంచి ఉత్పత్తులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. దీంతో సంస్థలో పనిచేయటానికి ఆసక్తి ఉన్నవారిని ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు తీసుకోవటానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

### మొదటి దశలో 25వేల మందికి ఉద్యోగావకాశాలు..

మొదటి దశలో రూ.2,640కోట్లతో ఫాక్స్‌కాన్ పరిశ్రమ ఏర్పాటుకు రూపకల్పన చేశారు. అందులో భాగంగానే మొదటిదశ పనులు త్వరలోనే పూర్తి కానున్నాయి. కొంగరకలాన్ కలెక్టర్ కార్యాలయల సమీపంలో రెండువందల ఎకరాల్లో అతి పొడవైన షెడ్లను ఏర్పాటు చేశారు. ఈ కంపెనీలో తయారయ్యే సెల్‌ఫోన్ల తయారీకి అనుగుణంగా ఈ ప్రాంతంలో పలు రకాల షెడ్లు, భవనాల నిర్మాణం చేపట్టారు. ఆగస్టు నుంచి ఇక్కడ ఫోన్ల తయారీ ప్రారంభంకానున్నది. మొత్తం రూ.4600కోట్ల వ్యయంతో ఈ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. రెండోదశలో మిగిలిన పనులను పూర్తిచేయనున్నారు. పూర్తిస్థాయిలో పరిశ్రమ తయారైతే లక్షమందికి ఉద్యోగాలు కల్పించాలన్న ధ్యేయంతో ఈ పరిశ్రమను ఏర్పాటు చేయడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### నెరవేరనున్న నిరుద్యోగుల కల..

ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఎంతో ఉన్నత ఆశయంతో ఏర్పాటు చేసిన ఫాక్స్‌కాన్ పరిశ్రమతో ఈ ప్రాంతంలోని నిరుద్యోగుల కల నెరవేరనుంది. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్న ఇబ్రహీంపట్నం ప్రాంత యువతకు ఈ కంపెనీ ఏర్పాటుతో ఉపాధి లభించనుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో ఈ ప్రాంతంలో ఫాక్స్‌కాన్ కంపెనీ ఏర్పాటు కానున్నది.

**– మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే**



కొంగరకలాన్ కలెక్టర్ కార్యాలయ సమీపంలో పూర్తికావస్తున్న ఫాక్స్‌కాన్ కంపెనీ పనులు